సాక్షి
పార్వతీపురం మన్యం

సోమవారం । 18 । నవంబర్ । 2024



కొండపై పంటలకు గిరాకీ

నలుదిక్కులా పచ్చని కొండలు. మధ్యలో చిన్న చిన్న వాగులు. ఆ మధ్యలో గిరిజనులు పండించే పంటలు ఆరబెట్టిన దృశ్యం ఆహ్లాదకర వాతావరణాన్ని కలిగిస్తుంది. - 8లో



ఆస్పత్రుల్లో నిండుకున్న మందులు

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందులు నిండుకున్నాయి. ఐదు నెలలుగా మందుల సరఫరా లేకపోవడంతో ప్రైవేట్ దుకాణాల్లో బాధితులు కొనుక్కోవాల్సిన దుస్థితి దాపురించింది. - 8లో



ఇదే సార్ మా బ్రాండు..!

ప్రజల అభీష్టాలకనుగుణంగా బియ్యాన్ని నాణ్యమైన ప్యాకింగ్ చేసి అమ్మకాలు చేసే లలిత, అక్షయ, సమీరా తదితర బ్రాండ్ల బియ్యం ప్యాకెట్లను ప్రజలు కొనుగోలు చేస్తుంటారు. - 8లో

న్యూస్‌రీల్

పీజీఆర్ఎస్ జిల్లా నోడల్ అధికారిగా రామ్‌గోపాల్



పార్వతీపురం: సెట్విజ్ సీఈఓ బి.రామ్‌గోపాల్‌ను ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) జిల్లా నోడల్ అధికారిగా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు చేశారు. ప్రభుత్వం పీజీఆర్ఎస్‌కు ప్రత్యేక గుర్తింపు ఇన్న నేపథ్యంలో నోడల్ అధికారిగా తనపై కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఎంతో నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించారని, అంకిత భావంతో పనిచేసి జిల్లాకు మంచి పేరు తీసుకువచ్చేందుకు కృషిచేస్తానని రామ్‌గోపాల్ ఈ సందర్భంగా తెలిపారు.

స్వచ్ఛ సుందరంగా పార్వతీపురం అభివృద్ధి

- కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్



టెలి కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: జిల్లాకేంద్రం పార్వతీపురం పట్టణాన్ని స్వచ్ఛ సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం ఆయన కలెక్టరేట్ నుంచి స్వచ్ఛ సుందర పార్వతీపురంపై అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిశుభ్రతకు మారుపేరుగా పార్వతీపురాన్ని నిలపాలని అధికారులకు సూచించారు. పరిశుభ్రతపై ప్రజలకు మరింత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. స్వచ్ఛ పార్వతీపురం కార్యక్రమానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అధికారులు పట్టణంలోని ఒక్కో కూడలిని దత్తత తీసుకుని సామాజిక బాధ్యతగా అభివృద్ధి చేయాలని సూచించారు. ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

21న జిల్లా దివ్యాంగుల రాష్ట్ర క్రికెట్ జట్టు ఎంపిక

పార్వతీపురంటౌన్: ఈ నెల 21 జిల్లా దివ్యాంగుల రాష్ట్ర క్రికెట్ జట్టును ఎంపిక చేయనున్నట్లు దివ్యాంగుల క్రికెట్ క్రీడాభివృద్ధి రాష్ట్ర సెక్రటరీ నాగురు హుస్సేన్ రాజా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగుల క్రికెట్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ తొలిసారిగా డిసెంబర్ 8వ తేదీ నుంచి 11 వరకు విశాఖపట్నంలోని గాజువాకలో గల హిందుస్థాన్ జింక్ మైదానంలో దివ్యాంగుల క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 21న పార్వతీపురం మన్యం జిల్లా జిల్లా జట్టు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. జట్టు ఎంపికకు వచ్చే క్రీడాకారులు తెల్ల దుస్తులతో హాజరు కావాలని కోరారు. ఆసక్తి గల దివ్యాంగ క్రీడాకారులు పార్వతీపురంలో గల జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ప్రాంగణంలో 9 గంటలకు హాజరు కాగలరని తెలిపారు. ఆధార్ కార్డు, దివ్యాంగుల ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా తీసుకు రావాలని తెలియజేశారు. ఆసక్తిగల క్రీడాకారులు మరిన్ని వివరాలకు ఫోన్ 85009 98512, 9959078682, 6374743730నంబర్లను సంప్రదించాలని సూచించారు.

గిరిజన హక్కులు కాపాడాలి

- గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి

పార్వతీపురంటౌన్: జీఓ నంబర్ 3 పునరుద్ధరణ, 1/70,పీసా చట్టం పక్కాగా అమలు చేసి, గిరిజన చట్టాలు, గిరిజన హక్కులు కాపాడాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరుతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులకు నష్టం చేసే నిర్ణయాలు, ఆలోచనలు మానుకోవాలని కోరారు. జిల్లా ఏర్పాటైన తర్వాత పార్వతీపురం ఐటీడీఏ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. జీఓ నంబర్ 3 పునరుద్ధరణకు ముఖ్యమంత్రి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరారు.

'అపార్' నమోదులో అవస్థలు

ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న అపార్ ప్రక్రియ నమోదుకు గిరిజన విద్యార్థులు వారి తల్లిదండ్రులు అనేక అవస్థలు పడుతున్నారని, ఆ అవస్థలు తీర్చి ప్రక్రియ సులువుగా, సక్రమంగా జరిగేలా కలెక్టర్, ఐటీడీఏ పీఓలు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో గిరిజన విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆర్థిక, సామాజిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని అపార్ ప్రక్రియ గిరిజన విద్యాసంస్థల్లోనే నేరుగా జరిగే విధంగా ఆలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు.

బాబూ.. మా జాబేది!



- నిరుద్యోగ యువతపై సర్కారు చిన్నచూపు
- నిరుద్యోగ భృతిపై స్పష్టత ఇవ్వని ప్రభుత్వం
- వలంటీర్ల తొలగింపుతో మరింత పెరిగిన నిరుద్యోగం
- ఉద్యోగాలు లేక యువకుల ఆందోళన
- ఇద్దరు నిరుద్యోగుల ఆత్మహత్యాయత్నం
- జిల్లాలో 98 వేల మంది నిరుద్యోగులు

ఏరు దాటినంత వరకు ఏటి మల్లన్న..ఏరు దాటాక బోడి మల్లన్న చందాన వ్యవహరిస్తోంది కూటమి ప్రభుత్వం. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎలాగైనా అధికారంలోకి రావాలన్న ఆశతో ఎడాపెడా హామీలు గుప్పించిన కూటమి నాయకులు..తీరా అధికారం చేపట్టాక తామిచ్చిన హామీలు మరిచిపోయినట్లు..తమకేమీ సంబంధం లేనట్లుగా నడుచుకుంటూ ఓట్లు వేసిన ప్రజలను అపహాస్యం చేస్తున్నారని జిల్లా ప్రజలు, నిరుద్యోగులు మండిపడుతున్నారు. -పార్వతీపురంటౌన్

- ఈ నెల 12న పార్వతీపురం మండలం నర్సిపురం గ్రామానికి చెందిన శ్రీనివాస రావు ఎమెస్సీ, బీఈడీ చదివాడు. ఉద్యోగ ప్రయత్నం చేసినప్పటికీ ఎటువంటి ఉద్యోగం రాకపోవడంతో మనస్తాపం చెంది ఇంట్లో ఉన్న ఫినాయిల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు ఆటోలో జిల్లా ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందించడంతో ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడ్డాడు.
- అదే రోజున జియ్యమ్మవలస మండలంలోని చినకుదమ గ్రామానికి చెందిన జయ చంద్రబాబు బీటెక్ 4వ సంవత్సరం చదువుతున్నాడు. ఉద్యోగం రాలేదని మనస్తాపం చెంది ఫినాయిల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాలప్డాడు. గమనించిన కుటుంబసభ్యులు మోటార్ సైకిల్‌పై జిల్లా ఆస్పత్రికి తీసుకువెళ్లగా వైద్యులు చికిత్స అందించడంతో ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడ్డాడు.

నిరుద్యోగ యువతపై సర్కారు చిన్న చూపు చూస్తోంది. అధికారంలోకి వస్తే ఇంటికో ఉద్యోగం ఇస్తామని ఆంతవరకు రూ.3వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం అందుకు తగ్గట్టుగా చర్యలు చేపట్టకపోవడంతో యువతలో ఆందోళన నెలకొంది. పార్వతీపురం మన్యం జిల్లాలో నిరుద్యోగ సమస్యతో సతమతమవుతున్న యువతలో కొందరు ఉద్యోగం లేదని ఆత్మహత్య యత్నానికి పాల్పడిన సంఘటనలు జరుగుతున్నాయి.

ఉద్యోగాలు, ఉపాధి కోసం జిల్లాలోని యువత ఎదురు చూస్తోంది. జాబ్ క్యాలెండర్‌పై యువకులు గంపెడాశలు పెట్టుకున్నారు. చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు ఇంటికో ఉద్యోగం వచ్చేంతవరకు 'నిరుద్యోగ భృతి' ఇవ్వాలని కోరుతున్నారు. అధికారంలోకి వచ్చి 5 నెలలు దాటినా, నిరుద్యోగ భృతి గురించి మాట్లాడడం లేదని, ఎప్పటి నుంచి ఇస్తారో స్పష్టంగా చెప్పాలని జిల్లాలోని సుమారు 98వేల కుటుంబాల్లో గల నిరుద్యోగ యువత డిమాండ్ చేస్తున్నారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు..ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలైనా నిరుద్యోగ భృతిపై నోరు మెదపక పోవడంతో నిరుద్యోగులంతా ఆవేదనలో ఉన్నారు. అలాగే వలంటీర్ల విధులపై స్పష్టత ఇవ్వకపోవడంతో జిల్లావ్యాప్తంగా నిరుద్యోగుల సంఖ్య మరో 5,678 మందికి పెరిగింది.



పార్వతీపురంలో నిర్వహించిన శంఖారావం సభలో సూపర్‌సిక్స్ హామీల గురించి మాట్లాడుతున్న ప్రస్తుత మంత్రి నారా లోకేష్ (ఫైల్)

మేనిఫెస్టోలో టాప్‌లో..

ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన ఉమ్మడి మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ హామీల్లో నిరుద్యోగులకు పెద్దపీట వేస్తున్నట్లు ప్రకటించారు. నిరుద్యోగులందరికీ ఉద్యోగాల కల్పనతో పాటు ఉద్యోగం వచ్చేంత వరకు ప్రతి ఒక్కరికీ నెలకు రూ.3 వేల భృతి ఇస్తామంటూ ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టారు. తీరా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 5 నెలలు దాటినప్పటికీ ఆ ఊసే ఎత్తడం లేదు. ప్రభుత్వం ఈ హామీని అమలు చేయడంలో జాప్యం చేస్తుండడంతో నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మళ్లీ మోసం చేస్తారా?

రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన చేపట్టేవరకు నెలకు రూ.3 వేలు చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని కూటమి నాయకులు సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో అదే ప్రధానహామీగా పదే పదే ప్రచారం చేశారు. తీరా అధికారం చేపట్టాక అయితే అసెంబ్లీ బడ్జెట్‌లో నిరుద్యోగులకు ఇవ్వాల్సిన భృతిపై ఒక్క మాట కూడా మాట్లాడలేదు. అసలు నిరుద్యోగ భృతి అమలుపై కనీసం విధివిధానాలు, మార్గదర్శకాల జారీపై కసరత్తు కూడా ప్రారంభించలేదు. గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు 2014-19లో నెలకు రూ.2 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి ఐదేళ్లు పబ్బం గడుపుకుని మొండి చెయ్యి చూపించారు. ఇప్పుడు కూడా అదే పరిస్థితి పునరావృతమవుతుందేమోనని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగమైనా, భృతి అయినా ఇవ్వాలి

గతంలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా ఉద్యోగమైనా ఇవ్వండి. లేదంటే నిరుద్యోగ భృతినైనా ఇవ్వండి. హామీ ఇచ్చారు కానీ అమలుపై ఆసక్తి చూపడం లేదు. అసలు నిరుద్యోగ భృతి అమలు చేసే ఉద్దేశం ప్రభుత్వానికి ఉందా? లేకుంటే ఎప్పటిలానే యూటర్న్ తీసుకుంటారా? నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేస్తారా? అని అనుమానంగా ఉంది.

ఉర్లాపు వేణు, శివిని గ్రామం, కొమరాడ మండలం

నిరుద్యోగులపై స్పష్టత లేదు

నిరుద్యోగ భృతిపై నూతన ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదు. గతంలో మాదిరిగా కాకుండా తక్షణమే నిరుద్యోగ భృతి ఇవ్వాలి. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా వయస్సుతో సంబంధం లేకుండా అర్హులందరికీ వర్తింపజేయాలి. పార్వతీపురం పట్టణ సమీపంలో నిర్వహించిన సభలో లోకేష్ ఉద్యోగం ఇస్తారని హామీ ఇచ్చారు. 5 నెలలు గడుస్తున్నా ఈ హామీపై స్పష్టత లేదు.

-బి.ప్రసాద్, నిరుద్యోగి, పార్వతీపురం

యువతంతా ఎదురు చూస్తున్నారు

నిరుద్యోగ భృతి కోసం యువత అంతా ఎదురు చూస్తున్నాం. గతంలో మాదిరి మోసం చేయకుండా తక్షణమే అమలు చేయాలి. ఉద్యోగాలు కల్పించేవరకు నిరుద్యోగ భృతి ఇవ్వాలి. దయచేసి ఈ సారి కూడా మోసం చేసి మాతో ఆట్లాడుకోవద్దు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోకుండా రూ.3 వేలు ఎప్పుడు ఇస్తారో స్పష్టత ఇవ్వాలి.

-రవీంద్ర, నిరుద్యోగి, పార్వతీపురం

మహిళల్లో పెరుగుతున్న రక్తహీనత

జిల్లాలో మహిళలను రక్తహీనత భయపెడుతోంది. ముఖ్యంగా 10 నుంచి 19 ఏళ్ల వయసు గల బాలికల్లో సగానికి సగం మందిలో రక్తహీనత నెలకొంది. గర్భిణుల్లోనూ ఇదే పరిస్థితి. సాధారణ మహిళలూ రక్తహీనతతో బాధపడుతున్నారు.

- గంట్యాడ మండలంలోని ఓ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 14 ఏళ్ల బాలికకు వైద్య సిబ్బంది హిమోగ్లోబిన్ పరీక్ష ఇటీవల నిర్వహించారు. హెచ్‌బీ 8 గ్రాములు ఉన్నట్టు నిర్ధారించారు.
- బొండపల్లి మండలంలోని ఓ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 15 ఏళ్ల బాలికకు వైద్య పరీక్షలు నిర్వహించగా హెచ్‌బీ 8.5 గ్రాములు ఉన్నట్టు గుర్తించారు.
- రాకోడు పీహెచ్‌సీ పరిధిలోని పినవేమలి గ్రామానికి చెందిన ఓ గర్భిణికి హెచ్‌బీ 7.8 గ్రాములు ఉండడంతో పీహెచ్‌సీలో రక్తం పెరగడానికి ఆమెకు సుక్రోజ్ ఇంజక్షన్ వైద్య సిబ్బంది ఎక్కించారు.

- మహిళల్లో పెరుగుతున్న రక్తహీనత
- జిల్లాలో 52,914 మంది బాలికలకు హెచ్‌బీ పరీక్షలు
- 26,457 మందికి రక్తహీనత ఉన్నట్టు గుర్తింపు
- గర్భిణుల్లోనూ ఇదే పరిస్థితి



గంట్యాడ మండలం పెదవేమలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికలకు హెచ్‌బీ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

విజయనగరం ఫోర్ట్:

జిల్లాలో ఇటీవల కాలంలో బాలికలు, గర్భిణులు, సాధారణ మహిళల్లో కూడా రక్తహీనత ఎక్కువగా ఉంటుంది. దీని వల్ల గర్భిణులైతే ప్రసవ సమయంలో రక్తం కోసం అవస్థలు పడుతున్నారు. అదే గ్రూపు రక్తం అందుబాటులో ఉంటే పరవాలేదు... లేదంటే ఇబ్బందులే.. బ్లడ్ బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి. బాలికలు రక్తహీనత వల్ల రుతుస్రావం సమయంలో ఇబ్బంది పడుతున్నారు. రక్తహీనత వల్ల సాధారణ మహిళలు తరచూ అనారోగ్యానికి గురవుతున్నారు.

వేలాది మంది బాలికల్లో రక్తహీనత

జిల్లాలో వేలాది మంది బాలికల్లో రక్తహీనత ఉన్నట్టు నిర్ధారణ అయింది. రక్తహీనత వల్ల బాలికలు అనారోగ్యం పాలవుతున్నారు. పలు ఇన్‌ఫెక్షన్లకు గురయ్యే ప్రమాదం కూడా ఉంది. 10 నుంచి 19 ఏళ్లలోపు బాలికల్లో ఎక్కువగా రక్తహీనతకు గురవుతున్నారు. బాలికల్లో రక్తహీనత అనేది ప్రధాన సమస్యగా మారింది.

కారణాలు ఇలా..

కడుపులోకి నులి పురుగులు చేరడం వల్ల అవి రక్తాన్ని పీల్చి తాగేయడం వల్ల రక్తహీనతకు గురవుతారు. బహిరంగ మల విసర్జన వల్ల, చెప్పులు లేకుండా నడవడం వల్ల, మట్టిలో ఆడటం వల్ల నులి పురుగులు శరీరంలోకి ప్రవేశించి రక్తాన్ని తాగేయడం వల్ల రక్తహీనత బారిన పడతారు. సరైన పోషకాహారం లేకపోవడం వల్ల కూడా రక్తహీనత బారిన పడతారు.

సగం మంది బాలికల్లో రక్తహీనత

జిల్లాలో 10 నుంచి 19 ఏళ్లలోపు బాలికలు 53,856 మంది ఉన్నారు. వీరిలో 20,484 మంది బాలికలు బడిబయట ఉన్నారు. 52,914 మంది బాలికలకు వైద్య సిబ్బంది హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. ఇందులో 26,457 మందికి రక్తహీనత ఉన్నట్టు గుర్తించారు. రక్త పరీక్షల నిర్వహించిన వారిలో సగం మందికి రక్తహీనత ఉండడం ఆందోళన కలిగిస్తున్న అంశం.

హెచ్‌బీ శాతాన్ని బట్టి చికిత్స

హిమోగ్లోబిన్ (హెచ్‌బీ) శాతాన్ని బట్టి రక్తహీనత ఉన్న వారికి వైద్య సిబ్బంది చికిత్స అందిస్తారు. హెచ్‌బీ 7 గ్రాముల్లోపు ఉంటే ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు రోజుకి 2 చొప్పున అందిస్తారు. 8 నుంచి 11 గ్రాముల్లోపు ఉంటే రోజుకి ఒక మాత్ర చొప్పున అందిస్తారు. మాత్రలతో రక్తహీనత నివారణ కాదనుకుంటే ఐరన్ సుక్రోజ్ ఇంజక్షన్ ఎక్కిస్తారు. హెచ్‌బీ నాలుగైదు గ్రాములు ఉన్న వారికి రక్తం ఎక్కిస్తారు.

చుట్టుముట్టే ఆరోగ్య సమస్యలు

రక్తహీనత వల్ల తరుచూ అనారోగ్యం బారిన పడతారు. ఇన్‌ఫెక్షన్స్ సోకే అవకాశం ఉంది. రక్తహీనత వల్ల తరుచూ తలనొప్పి రావడం, కళ్లు తిరగడం, నిద్ర పట్టకపోవడం, జ్ఞాపకశక్తి తగ్గిపోవడం జరుగుతుంది. ఛాతిలో నొప్పి, వేగంగా గుండె కొట్టుకోవడం, ఊపిరి తీసుకోవడం కష్టమవుతుంది. అలసట, చిన్నచిన్న పనులకే నీరస పడడం జరుగుతుంది. చేసే పని పట్ల ఆసక్తి ఏకాగ్రత లేకపోవడం, నాలుక నొప్పి, చర్మం పాలిపోయినట్లు కనిపించడం జరుగుతుంది. రుతుచక్రంలో అసమానతలు రావడం జరుగుతుంది.



విజయనగరం మండలం రాకోడు పీహెచ్‌సీలో గర్భిణికి సుక్రోజ్ ఎక్కిస్తున్న చిత్రం

చర్యలు తీసుకుంటున్నాం..

బాలికలు, గర్భిణులు, సాధారణ మహిళల్లో రక్తహీనత నివారణకు అన్ని చర్యలూ తీసుకుంటున్నాం. పాఠశాలల్లో హెచ్‌బీ పరీక్షలు నిర్వహించి రక్తహీనత ఉన్న వారికి రక్తం పెరిగేందుకు చర్యలు చేపడుతున్నాం. గర్భిణుల్లో హెచ్‌బీ నివారణకు ఐరన్ మాత్రలు అందిస్తున్నాం. సుక్రోజ్ ఇంజక్షన్లు ఎక్కిస్తున్నాం. ఇంకా అవసరమనుకుంటే ఆస్పత్రుల్లో చేర్పించి రక్తంఎక్కిస్తున్నాం.

- డాక్టర్ రాణి, డీఎంహెచ్‌ఓ

మన్యంలో పర్యాటకుల సందడి



హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడుస్తున్న యువతులు

సీతంపేట: జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో పర్యాటకులు ఆదివారం సందడి చేశారు. పర్యాటక ప్రదేశాల్లో పిక్నిక్‌లు చేసుకుంటూ సంతోషంగా గడిపారు. సీతంపేట మండలంలోని ఆడలి వ్యూపాయింట్‌తో పాటు మెట్టుగూడ జలపాతం పర్యాటకులతో కళకళలాడింది. స్థానిక అడ్వెంచర్ పార్కులో వివిధ సాహస క్రీడల్లో పర్యాటకులు పాల్గొన్నారు. జలవిహార్‌లో బోటుషికారు చేసి, హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడిచారు.



జలవిహార్‌లో బోటుషికారు చేస్తున్న పర్యాటకులు



సీతంపేటలో పిక్నిక్ నిర్వహిస్తున్న పర్యాటకులు

శతశాతం సబ్సిడీతో ఆయిల్ పామ్ మొక్కలు

సీతంపేట: వందశాతం సబ్సిడీపై రైతులకు ఆయిల్‌పామ్ మొక్కలు సరఫరా చేయనున్నట్లు ఉద్యానవనాధికారి పేడాడ జయశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె సీతంపేట ఏజెన్సీలో ఈ పంటను మార్కెటింగ్ చేయడానికి శాంతి ఆయిల్‌పామ్ కంపెనీ వచ్చిందని పేర్కొన్నారు. 3 సంవత్సరాల నుంచి 30 సంవత్సరాల వరకు ఈ పంట పండుతుందని, నీటి సదుపాయం తప్పనిసరిగా ఉండాలన్నారు. ఇండియన్ వెరైటీ మొక్క రూ.133, ఎక్స్‌పోర్టెడ్ వెరైటీ మొక్క ధర రూ.193 ఉంటుందన్నారు. అయితే సాగుచేసే రైతులకు పూర్తి ఉచితంగా మొక్కలను కంపెనీ సరఫరా చేస్తుందని స్పష్టం చేశారు. వాటిలో అంతర్‌పంటలు వేసుకోవడానికి ప్రభుత్వం రూ.2100 సహాయం చేస్తుందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

అరకు అందాలు ప్రత్యేకం

- పార్వతీపురం మన్యం కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



అరకు పైనరీ వద్ద పార్వతీపురం మన్యం కలెక్టర్ ఎం.శ్యామ్‌ప్రసాద్ దంపతులు

దుంబ్రిగుడ: మన్యంలో అరకు అందాలు ప్రత్యేకమని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎం.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. ఆదివారం ఆయన కుటుంబ సభ్యులతో అరకు పైనరీని సందర్శించారు. మేనేజర్ శేఖర్ వారికి ఘన స్వాగతం పలికారు. పైనరీలో వనాల అందాలను తిలకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అరకులోయ ప్రాంతంలో అద్భుత ప్రదేశాలు ఎన్నో ఉన్నాయన్నారు. తమను ఈ అందాలు ఎంతగానో ఆకట్టుకున్నాయని తెలిపారు. పైనరీని పరిశుభ్రంగా ఉంచిన ఉద్యోగులు, సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దంపతులతో సిబ్బంది ఫొటోలు దిగారు. అనంతరం అరకు లోయలో గిరిజన మ్యూజియాన్ని కుటుంబ సభ్యులతో కలెక్టర్ సందర్శించారు.


చివరి ప్రయత్నం



ఖరీఫ్ వరి చివరి దశకు వచ్చేసరికి పలుచోట్ల చివరి తడి అందలేదు. దీంతో గింజ దశలో పొట్ట ఎండిపోతుండడంతో అన్నదాత తన చివరి ప్రయత్నంగా నీరందించేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తున్నాడు. కూటమి ప్రభుత్వ సహకారం లేకున్నా.. అప్పులు తెచ్చి పంట సాగు చేస్తున్న రైతులకు ఈ నీరు అందించడం ఆర్థిక భారంగానే ఉంది. అయినా ఆశను వదల్లేక అప్పులు చేసి ఇంజన్లు పెట్టి నీరు పొలాలకు అందిస్తున్నారు. కొత్తవలస మండలం వీరభద్రపురం గ్రామ సమీపంలో ఓ రైతు తమ పంట పొలానికి చివరి దశలో నీరందించేందుకు చేస్తున్న భగీరథ ప్రయత్నమిది!

- కొత్తవలస

పోరాటానికి సిద్ధం



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి విజయగౌరి

బొబ్బిలి: పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో యూటీఎఫ్ స్వర్ణోత్సవాల మహాసభ ఆదివారం జరిగింది. సభలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.విజయగౌరి మాట్లాడుతూ విద్యా రంగంలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలు సవాళ్లుగా మారుతున్నాయని పేర్కొన్నారు. ఇటువంటి పరిస్థితి నుంచి బయటపడేందుకు భవిష్యత్‌లో మరిన్ని పోరాటాలు సమష్టిగా చేసేందుకు సిద్ధమన్నారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులను సత్కరించారు. మహాసభలో యూటీఎఫ్ కార్యవర్గ సభ్యుడు ఆనెం శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి జేఏవీ ఈశ్వరరావు, జిల్లా సహాధ్యక్షుడు ప్రసన్నకుమార్, కార్యదర్శి కేశవరావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుమ్మరిగుంటలో గజరాజుల గుంపు



కుమ్మరిగుంటలో టమాటో, అరటి తోటల్లో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

- పట్టించుకోని అటవీశాఖ సిబ్బంది
- ఆందోళన వ్యక్తం చేస్తున్న అన్నదాత

కొమరాడ: ఆరుగాలం కష్టపడి పంటలు పండిస్తే చేతికి వచ్చే సమయంలో గజరాజుల గుంపు సంచారంతో పంటనాశనం అవుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పగలంతా ఏనుగులు ఆర్తాం కొండపైకి వెళ్తున్నాయి. రాత్రిపూట పంటపొలాల్లో సంచరిస్తున్నాయి. పదిహేను రోజులుగా కుమ్మరిగుంట, కందివలస గ్రామాల్లో ఏనుగులు సంచరిస్తున్నాయి. అయితే కొమరాడ మండలంలోని కుమ్మరిగుంట, గంగిరేగువలస, స్వామినాయుడు, కందివలస, కళ్లికోట, దుగ్గి, గుణానుపురం తదితర గ్రామల్లో కూరగాయల సాగు ఎక్కువగా ఉంది టమాటో, క్యాబేజీ, చిక్కుడు, వంగతో పాటు జామ, బొప్పాయి, అరటి లాంటి వాణిజ్య పంటలు పండుతున్నాయి. పంట చేతికి వచ్చే సమయంలో గజరాజులు పొలాల్లో సంచరించడం వల్ల పంటలు నాశనమవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతం నుంచి గజరాజులను తరలించే ఏర్పాట్లు అధికారులు చేయాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

పూరిల్లు దగ్ధం



మంటలు అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

జామి: మండలంలోని రామయ్యపాలెం పంచాయతీ గదబపాలెం గ్రామంలో పూరిల్లు దగ్ధమైంది. దీనిపై స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఈదు బిల్లి బోడయ్య పూరింట్లో విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి ఆదివారం దగ్ధమైంది. దీంతో కొత్తవలస అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో సిబ్బంది వచ్చి మంటలు అదుపులోకి తీసుకువచ్చారు. అయితే పూరిల్లు మొత్తం అప్పటికే పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.లక్ష ఆస్తి నష్టం సంభవించింది. అయితే ప్రమాదం జరిగిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో అదృష్టవశాత్తు ఎటువంటి ప్రాణనష్టంజరగలేదు.

కారును ఢీకొన్న ఆటో: మహిళ మృతి

- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో మృతి చెందిన తోట లక్ష్మి (ఫైల్)

భోగాపురం: ముందువెళ్తున్న కారును ఓవర్‌టేక్ చేయబోయిన ఆటో ఆ కారును ఢీకొని బోల్తాపడడంతో జరిగిన ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రగాయాలపాలయ్యారు. ఆదివారం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. విశాఖపట్నం జిల్లా అక్కయ్యపాలెం ప్రాంతానికి చెందిన తోట లక్ష్మి..భర్త, కుటుంబ సభ్యుల(8మంది)తో కలిసి వారి బంధువుల ఇంట్లో జరగనున్న బారసాల కార్యక్రమానికి ఆదివారం ఉదయం ఆటోలో విజయనగరం జిల్లా గరివిడి బయలుదేరారు. మార్గమధ్యంలో అవనాం వద్దకు చేరుకునేసరికి ముందు వెళ్తున్న కారును ఓవర్‌టేక్ చేస్తున్న క్రమంలో ఆటో అదుపుతప్పి కారును బలంగా ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తోట లక్ష్మి(45) అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రగాయాలపాలయ్యారు. మిగిలిన వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికుల ద్వారా ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు, హైవే సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని తీవ్రగాయాపాలైన వారిని విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. లక్ష్మి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సుందరపేట సీహెసీకి తరలించారు. మృతుని బంధువు తోట కనకరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సూర్యకుమారి తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

విజయనగరం క్రైమ్: విజయనగరం -గొట్లాం రైల్వేస్టేషన్‌ల మధ్యలో ద్వారపూడి గ్రామ సమీపంలో రైల్వేట్రాక్‌పై సుమారు 20 నుంచి 25 ఏళ్ల వయసు కలిగిన వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు జీఆర్‌పీ ఎస్సై వి.బాలాజీరావు ఆదివారం తెలిపారు. మృతుడు శరీరంపై గ్రే కలర్ టీషర్ట్, బ్లూకలర్ షార్ట్ ధరించి ఉన్నాడని చెప్పారు. రైల్వే అధికారులిచ్చిన సమాచారంతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని, ఎవరైనా గుర్తుపడితే వెంటనే ఫోన్ 9490617089 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

14 మద్యం సీసాలతో నిందితురాలి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో సిబ్బంది

సీతానగరం: సీతానగరం పరిధి ఎస్ఎస్‌పురంలో మద్యం బెల్ట్ షాపు నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడి చేసి 14 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని నిర్వాహకురాలైన మహిళను అరెస్ట్ చేసినట్లు సీఐ డి.పద్మావతి ఆదివారం తెలిపారు. ఈ మేరకు సర్కిల్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో అక్రమంగా మద్యం విక్రయించినా, బెల్ట్‌షాపులు నిర్వహించినా, ఎమ్మార్పీ కంటే ఎక్కువకు విక్రయాలు చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో మద్యం బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నట్లు తెలిసినా తక్షణమే సిబ్బందితో సోదాలు చేయనున్నట్లు స్పష్టం చేశారు. అలాగే బలిజిపేట, గరుగుబిల్లి మండలాల్లో కూడా సిబ్బంది చేపట్టనున్నట్లు తెలిపారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹112	₹194	₹204



గిరిజన గ్రామంలో ఆరబెడుతున్న అపరాలు

- సహజ సిద్ధంగా సాగు
- గిరిజనుల ఉత్పత్తులపై మైదాన ప్రజల ఆసక్తి

గిరిజనులు సాగు చేస్తున్న నువ్వు పంట



కొండపై పంటలకు గిరాకీ

బొబ్బిలి రూరల్: నలుదిక్కులా పచ్చని కొండలు, మధ్యలో చిన్నచిన్న వాగులు, ఆ మధ్యలో గిరిజనులు పండించే పంటలు ఆరబెట్టిన దృశ్యం ఎంతో ఆహ్లాదకర వాతావరణాన్ని కలిగిస్తుంది. కూరగాయలు పెద్దఎత్తున సాగుచేస్తూ వాటితో పాటు పశుసంపదను గిరిజనులు అభివృద్ధి చేసుకుంటున్నారు. మండల పరిధిలోని పలు గిరిజన గ్రామాల్లో పండిస్తున్న వాణిజ్యపంటలకు చాలా గిరాకీ ఏర్పడింది. పండిన ఉత్పత్తులు నాణ్యమైనవి కావడం, రసాయనాల వినియోగం లేనివి కావడంతో ఈ పంటలను కొనుగోలు చేసేందుకు వినియోగదారులు పెద్ద ఎత్తున ఆసక్తి చూపిస్తున్నారు. చూడముచ్చటగా కనిపించే పచ్చని కొండల్లో పండించే ఈ ఉత్పత్తులకు కొనుగోలుదారులు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారు. పట్టణం ప్రాంతాల ప్రజలు కొంతమంది గిరిజనులు పండించే ప్రాంతాలకు వెళ్లి అక్కడి వాతావరణాన్ని ఆస్వాదిస్తూ కోరుకున్న పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నారు. రాగులు, మొక్కజొన్నలు, సిరిధాన్యాలు, పెసలు, మినుములు తదితర రకాలైన పంటలను గిరిపుత్రులు సాగుచేస్తున్నారు. గిరిజనుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి పట్టణంలో ఎక్కువ ధరలకు అమ్మే వ్యాపారులు కూడా గిరిజనుల చెంతకు వాలిపోతున్నారు. వారికి కావాల్సిన పంటలను సాగుచేయాలని ముందుగానే అడ్వాన్స్‌లు ఇచ్చి మరీ పండించుకుంటున్నారు. అలాగే సీజన్‌లలో పండే పంటలకు మంచి డిమాండ్ ఉంది. ప్రస్తుతం బొబ్బిలి మండలంలోని రాచేరువలస, బట్టివలస, మోసూరువలస, నిమ్మలపాడు తదితర గిరిజన గ్రామాల్లో దొరుకుతున్న పంటలకు మంచి ధర పలుకుతుండడంతో గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



గిరిజనుల పశుసంపద



ఇళ్ల మధ్య ఆరబెట్టిన రాగులు



కొండల్లో పండించిన మొక్కజొన్న

ఇదే సార్ మా బ్రాండు..!

- బయటపడిన ఘరానా మోసం
- బ్రాండెడ్ కవర్లలో కల్తీ బియ్యం
- పీడబ్ల్యూ మార్కెట్‌లో కోట్లలో వ్యాపారం



స్వాధీనం చేసుకున్న బ్రాండెడ్ ప్యాకెట్ కవర్లలో కల్తీరైస్‌ను చూపిస్తున్న వన్‌టౌన్ ఎస్సై నరేష్

విజయనగరం క్రైమ్: ఎన్నో వ్యయప్రయాసల కోర్చి ప్రజల అభీష్టాలకనుగుణంగా బియ్యాన్ని నాణ్యమైన ప్యాకింగ్ చేసి అమ్మకాలు చేసే లలిత, అక్షయ, సమీరా తదితర బ్రాండ్‌ల బియ్యం ప్యాకెట్లను ప్రజలు కొనుగోలు చేస్తుంటారు. అటువంటి బ్రాండెడ్ రైస్‌ను ఇంటికి తీసుకువచ్చిన తర్వాత అన్నం ముద్దయిపోవడం, సరిగ్గా ఉడకకపోవడం వంటివి జరుగుతుండడంతో వినియోగదారులు ప్యాకింగ్‌లు ఓపెన్ చేసేసి, తిరిగి వాటిని ఇవ్వలేక తప్పనిసరి పరిస్థితుల్లో తినాల్సిన పరిస్థితి దాపురించింది. ఈ పరిస్థితులను పసిగట్టిన సంబంధిత బ్రాండెడ్ సంస్థల ప్రతినిధులు ఏం జరుగుతుందోనని అనుమానంతో నిఘా పెట్టి అసలు విషయం గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు చేపట్టిన దర్యాప్తులో కల్తీబియ్యాన్ని బ్రాండెడ్ కవర్లలో నింపుతున్నారన్న విషయాన్ని గుర్తించారు. రవాణాకు సిద్ధంగా ఉన్న రైస్‌బ్యాగ్‌లను పట్టుకుని సీజ్ చేశారు. ఈ మేరకు ఈ వ్యవహారంపై వన్‌టౌన్ ఎస్సై నరేష్ ఆదివారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

హైదరాబాద్‌లో బ్రాండెడ్ కవర్ల తయారీ

గంటస్తంభం దగ్గర గల పీడబ్ల్యూ మార్కెట్ బియ్యం అమ్మకాలకు ప్రసిద్ధి. ఇక్కడ దొరకని బ్రాండ్ అంటూ ఉండదంటే అతిశయోక్తి లేదు. నిత్యం కోట్లలో వ్యాపారం జరుగుతూ ఉంటుంది. పీడబ్ల్యూ మార్కెట్‌లో శ్రీ జయలక్ష్మి ట్రేడర్స్ పేరుతో పెంటపాటి ఈశ్వర వెంకటరెడ్డి అలియాస్ రాజా హైదరాబాద్‌లో పద్మావతీ పాలీశాక్స్ అనే సంస్థను నడుపుతున్న శ్రీనివాసరావు దగ్గర నుంచి లలితా, అక్షయ, సమీర తదితర బ్రాండ్‌లను పోలి ఉన్న ఖాళీ బ్యాగ్‌లను జిల్లా కేంద్రానికి తెప్పించి, అందులో తక్కువ క్వాలిటీ రైస్‌ను నింపి కొనుగోలుదారులకు కనీసం అనుమానం రాకుండా మోసం చేస్తున్నాడు. వినియోగదారులు ఎవరూ చూసినా అవి బ్రాండెడ్ అనుకునేరీతిలో తక్కువ క్వాలిటీ రైస్ అమ్మకాలు చేస్తున్నాడు. ఈ విషయం పసిగట్టిన ఆ బ్రాండెడ్ కంపెనీల ప్రతినిధులు నిఘా పెట్టడంతో అసలు గుట్టు బయటకువచ్చింది. శ్రీ లలితా రైస్ సేల్స్‌మెన్ భగవాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన వన్‌టౌన్ ఎస్సై నరేష్, సిబ్బందితో కలిసి దాడి చేసి మొత్తం 641 రైస్‌బ్యాగ్‌లు 16, 666 కిలోల రైస్‌ను సీజ్ చేశారు. విచారణ నిమిత్తం జిల్లా రైస్ మార్కెటింగ్ మేనేజరుకు బియ్యం అప్పగించామని, బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

'ముత్యాల వాన' పుస్తకావిష్కరణ



ముత్యాలవాన పుస్తకావిష్కరణ చేస్తున్న కవులు, సాహితీవేత్తలు

విజయనగరం టౌన్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సాహితీ స్రవంతి, సరోజిని మహిళా మండలి ఆధ్వర్యంలో కవిగాయక సమ్మేళనం, రావిపల్లి వాసుదేవరావు రచించిన 'ముత్యాలవాన' పుస్తకావిష్కరణ ఆదివారం సాయంత్రం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించారు. ఔత్సాహిక కవులు ఇజ్రాయిల్ దురాగతంపై , మహిళల పట్ల జరుగుతున్న ఆకృత్యాలపై ఈ సందర్భంగా వారి గళం వినిపించారు. కవి పాయల మురళీకృష్ణ రచించిన ముత్యాలవాన పుస్తకాన్ని సభకు పరిచయం చేశారు. కార్యక్రమంలో సాహితీస్రవంతి ప్రతినిధులు చీకటి దివాకర్, చంద్రికారాణి, శ్రీనివాసరావు, మురళి, కవులు దోసపాటి రామచంద్రరావు, మానాపురం రాజా చంద్రశేఖర్, బద్రికూర్మారావు, కొంకేపూడి అనూరాధ, జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సీపీఎం జిల్లా మహాసభలు

- జిల్లా కార్యదర్శిగా తమ్మినేని సూర్యనారాయణ
- 14 మందితో జిల్లా కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు

విజయనగరం ఫూల్‌బాగ్: విజయనగరం జిల్లా సీపీఎం కార్యదర్శిగా తమ్మినేని సూర్యనారాయణ ఎన్నికయ్యారు. నగరంలోని ఏచూరినగర్‌లో గల బుద్ధదేవ్ భట్టాచార్య, రుద్రరాజు సత్యనారాయణ ప్రాంగణంలో రెండురోజులుగా జరుగుతున్న సీపీఎం జిల్లా మహాసభలు ఆదివారం ముగిశాయి. చివరిరోజు జరిగిన ప్రతినిధుల సభలో 14 మందితో ఏర్పాటైన నూతన జిల్లా కమిటీలో జిల్లా కార్యదర్శిగా తమ్మినేని సూర్యనారాయణను మళ్లీ మహాసభ ఎన్నుకుంది. కార్యదర్శివర్గ సభ్యులుగా రెడ్డి శంకర్రావు, టీవీ రమణ, పి.శంకర్రావు, వి.లక్ష్మి ఎన్నిక కాగా, జిల్లా కమిటీ సభ్యులుగా ఎ.జగన్‌మోహన్‌రావు, జి.శ్రీనివాస్, గాడి అప్పారావు, పి.రమణమ్మ, కె.సురేష్, సీహెచ్ వెంకటేష్, వీఆర్ గోపాల్, బి రాంబాబు ఎన్నికయ్యారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు వై.వెంకటేశ్వరరావు, లోకనాథం, రాష్ట్ర కమిటీ సభ్యుడు సూర్యారావు పాల్గొన్నారు.

12 కేసుల్లో నిందితుడిపై పీడీయాక్ట్

- ఎస్పీ వకుల్ జిందాల్



విజయనగరం క్రైమ్: గడిచిన మూడేళ్లలో 12 కేసుల్లో నిందితుడిగా అరెస్ట్ అయిన 22 ఏళ్ల బండి రాజీవ్ అలియాస్ డాడీపై కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ఎస్పీ వకుల్ జిందాల్ పీడీయాక్ట్ అమలుచేశారు. ఈ విషయాన్ని ఆదివారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. చట్టాన్ని తరచూ ఉల్లంఘిస్తూ, ప్రజాశాంతికి భంగం కలిగిస్తూ, సమాజానికి ప్రమాదకరంగా మారుతూ, భౌతిక దాడులకు పాల్పడుతూ, పలు కేసుల్లో నిందితుడిగా అరెస్ట్ అయిన పట్టణశివారు ఫూల్‌బాగ్ కాలనీకి చెందిన బండి రాజీవ్ అలియాస్ డాడీ అనే 22 ఏళ్ల వ్యక్తిపై పీడీయాక్ట్ ప్రయోగించి ముందస్తు నేర నియంత్రణ చర్యల్లో భాగంగా నిర్బంధించి, విశాఖ కేంద్ర కారాగారానికి తరలించామని ఎస్పీ తెలిపారు. చెడువ్యసనాలకు అలవాటు పడి, ప్రజల పట్ల అహంకారంతో దురుసుగా ప్రవర్తిస్తూ, ఇతరులకు హానికలిగించే విధంగా చిన్న చిన్న విషయాలకే గొడవలు పడుతూ, భౌతిక దాడులకు పాల్పడుతూ, గత మూడేళ్లలో విజయనగరం వన్‌టౌన్, టూటౌన్, రూరల్ పోలీసు స్టేషన్‌ల పరిధిలో 12 కేసుల్లో నిందితుడిగా అరెస్ట్ అయ్యాడని వివరించారు. నేరాల నియంత్రణకు జిల్లా పోలీసుశాఖ చేపడుతున్న ముందస్తు చర్యల్లో భాగంగా పీడీయాక్ట్‌ను అమలుచేయాలని కోరుతూ టూటౌన్ పోలీసులు జిల్లా పోలీసు కార్యాలయానికి ప్రతిపాదనలు పంపించారన్నారు. వాటిని సిఫార్స్ చేస్తూ కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు ప్రతిపాదనలు పంపామన్నారు. వివిధ క్రిమినల్ కేసుల్లో అరెస్టు చేసిన నిందితులపై నిరంతరం నిఘా ఉంటుందని, ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టప్రకారం కఠినచర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిండుకున్న మందులు

- ప్రైవేట్ షాపుల్లో కొని తేవాలని వైద్యసిబ్బంది సూచన
- తప్పనిసరి పరిస్థితిల్లో కొని తెచ్చుకుటున్న బాధితులు



ప్రైవేట్ మందుల షాపు నించి తెచ్చిన సిరింజిలతో కుక్క కాటుకు గురైన బాధితుడికి వైద్యం చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

కొత్తవలస: ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందులు నిండుకున్నాయి. గడిచిన ఐదునెలలుగా పూర్తిస్థాయిలో మందుల సరఫరా లేకపోవడంతో ప్రైవేట్ దుకాణాల్లో బాధితులు కొనుక్కోవాల్సిన దుస్థితి దాపురించింది. ఈ విషయం ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదని బాధితులు వాపోతున్నారు. కొత్తవలస మండలంలోని వియ్యంపేట పీహెచ్‌సీలో పూర్తిస్థాయిలో మందులు లేవు. దీంతో సమీపంలో గల మందుల షాపులో బాధితులు మందులు కొనుక్కుంటున్నారు. ఈ క్రమంలో మండలంలోని కర్రిచిన్నయ్యపాలెం గ్రామానికి చెందిన లెంక హిమశ్రీ, ముసిరాం గ్రామానికి చెందిన చింతల చింతాలయ్యలు ఆదివారం కుక్కకాటు బారినపడ్డారు. దీంతో బాధితులను బంధువులు వియ్యంపేట పీహెచ్‌సీకి తీసుకువచ్చారు. వెంటనే అక్కడి సిబ్బంది బాధితులకు ఇన్సులిన్ ఇంజెక్షన్ చేయాలని, అందుకు అవసరమైన సిరంజిలు తీసుకురావాలని బాధితుల కుటుంబసభ్యులకు తెలిపారు. వారు వెంటనే సమీపంలో గల ప్రైవేట్ మందుల దుకాణానికి వెళ్లి సిరింజీలు తెచ్చుకోగా వైద్యసిబ్బంది బాధితులకు ఇంజక్షన్‌లు చేశారు. ఈ విషయమై వైద్యసిబ్బందిని వివరణ కోరగా గడిచిన ఐదు నెలలుగా ఇన్సులిన్ సిరింజిలతో పాటు మరికొన్ని మందులు రావడంలేదని, మా దగ్గర లేనందున ప్రైవేట్ దుకాణాల్లో తెచ్చుకోవాలని సూచిస్తున్నామన్నారు. ప్రభుత్వం సరఫరా చేయకపోతే తామేం ఏంచేయాలని బదులిచ్చారు.



ప్రైవేట్ మెడికల్ స్టోర్ నుంచి తెచ్చిన సిరింజిలను చూపిస్తున్న లెంక హిమశ్రీ నాయనమ్మ వరహాలమ్మ

నిర్బంధ అరెస్టును ఖండించిన వీఆర్‌ఏల సంఘం



వీఆర్‌ఏ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకన్నను అరెస్టు చేసి వల్లంపూడి పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించిన దృశ్యం

వేపాడ: నిబంధనలకు విరుద్ధంగా అదనపు విధులు నిర్వహించలేమని తమ సమస్యలు చెప్పుకునేందుకు చలో సీసీఎల్ఏ కార్యక్రమం చేపడితే ప్రభుత్వం నిర్బంధంగా అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గట్టు వెంకన్న అన్నారు. ఈ నెల 18న నిర్వహించే చలో సీసీఎల్ఏ రాయబారం కార్యక్రమానికి వెళ్లకుండా వల్లంపూడి పోలీసులు ఆదివారం తనను అరెస్టు చేయడం దారుణమని వాపోయారు. వీఆర్‌ఏలకు అదనంగా అప్పగిస్తున్న ఇసుక ర్యాంపులు, రైస్‌మిల్లుల డ్యూటీలు రద్దుచేయాలని, తెలంగాణలో అమలయ్యే విధంగా పేస్కేల్ వర్తింపచేయాలని, అటెండర్, వాచ్‌మెన్, రికార్డు అసిస్టెంట్, తదితర పోస్టుల్లో అర్హులైన వీఆర్‌ఏలను నియమించాలని తదితర డిమాండ్‌లతో 18న శాంతియుతంగా మంగళగిరి సీసీఎల్ఏతో సామూహిక రాయబారం కార్యక్రమం నిర్వహించ తలపెట్టామన్నారు. ఈ కార్యక్రమానికి వెళ్లకుండా శుక్రవారం సాయంత్రం నుంచి బెదిరింపులు ప్రారంభించి ఆదివారం నిర్బంధంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా రాష్ట్ర సంఘం తరపున ఖండిస్తున్నామన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని గడిచిన మూడునెలలుగా సీఎం, రాష్ట్ర రెవెన్యూ మంత్రి, రాష్ట్ర రెవెన్యూ శాఖ కార్యదర్శి, భూపరిపాలన ముఖ్యకార్యదర్శులను పలుమార్లు కలిసి సమస్యలు పరిష్కరించాలని కోరామన్నారు. శాంతియుతంగా చేపట్టిన రాయబారి కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు నిర్బంధ అరెస్టుచేయడాన్ని ఖండిస్తున్నామని స్పష్టం చేశారు.

వెనుకబడిన విద్యార్థులకు తొలి ప్రాధాన్యం



మాట్లాడుతున్న డీఈఓ యు.మాణిక్యం నాయుడు

- డీఈఓ యు.మాణిక్యం నాయుడు

విజయనగరం అర్బన్: తరగతి గదిలో వెనుకబడి ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి తొలి ప్రాధాన్యం ఇచ్చి బోధనా విధానాన్ని రూపొందించుకోవాలని డీఈఓ యు.మాణిక్యం నాయుడు అన్నారు. ఆంధ్రప్రదేశ్ గణిత ఫోరం జిల్లా కమిటీ స్థానిక కస్పా మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో 'పదో తరగతి గణిత పబ్లిక్ పరీక్ష బ్లూ ప్రింట్ పై ఆదివారం నిర్వహించిన మోడల్ పేపర్ శిక్షణ కార్యక్రమం ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపి బోధనా కృత్యాలు తయారు చేయాలని చెప్పారు. అనంతరం మోడల్ బ్లూ ప్రింట్ రూపకలనపై పదోతరగతి గణిత పాఠ్యపుస్తక రచయిత జీవీబీఎస్ఎన్‌రాజు శిక్షణ ఇచ్చారు. ఫోరం రాష్ట్ర సలహాదారు సిద్ధాంతం త్రినాథరావు మాట్లాడుతూ కాస్ట్ టీఎల్ఎం, కలర్ పేపర్స్‌తో మ్యాథ్స్ టీఎల్ఎం ఎలా తయారు చేయాలో చేసి చూపించారు. వచ్చేనెలలో జరగబోయే జాతీయ గణిత దినోత్సవం ఎలా నిర్వహించాలనే విషయాలపై సమీక్షించారు. అనంతరం ఫోరం సభ్యులు డీఈఓను ఘనంగా సత్కరించారు. సమావేశంలో ఇన్నర్ వీల్ క్లబ్ మాథ్స్‌లో ఎక్కువ సేవలు అందిస్తున్న బెస్ట్ టీచర్ అవార్డుల కింద మాథ్స్ టీచర్లను సన్మానించారు. కార్యక్రమంలో ఫోరం జిల్లా అధ్యక్షుడు వాక చిన్నంనాయుడు, పధాన కార్యదర్శి కృష్ణంరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, 70 మంది గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నకిలీ నోట్ల చలామణి ముఠా అరెస్టు



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న నకిలీ ఐదు వందల నోట్లు

పరవాడ (విశాఖ జిల్లా): లంకెలపాలెం ప్రాంతంలో నకిలీ కరెన్సీని చలామణి చేస్తున్న నలుగురు నిందితులను పరవాడ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. అనకాపల్లి మండలం విజయరామరాజుపేటకు చెందిన ఓమ్ము భానుప్రకాష్, వై.ఆదర్శ్, పెదరెల్లి వీధికి చెందిన పొట్నూరు హరిచంద్రప్రసాద్, విజయనగరం జిల్లా రాజాం మండలం బూరాడ గ్రామానికి చెందిన తీగల క్రాంతికుమార్‌లు అరెస్టు చేసిన వారిలో ఉన్నారు. పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. కోనసీమ జిల్లా ముమ్మిడివరం గ్రామానికి చెందిన గుత్తుల విశాల్, అతని మామయ్య శీలం శ్రీనుతో కలిసి ఈ నెల 16న టాటా ఏస్ వ్యాన్‌లో కొబ్బరి బొండాల లోడును తీసుకుని వచ్చి విశాఖలోని ఎన్ఏడీ కొత్త రోడ్డులో ఆదివారం ఉదయం 3.30 గంటలకు అన్‌లోడ్ చేశారు. తిరుగు ప్రయాణంలో లంకెలపాలెం కూడలిలో టీ తాగడానికి సాయంత్రం 4.30 గంటలకు ఆగారు. ఆ సమయంలో అక్కడికి పై నలుగురు వచ్చి రూ.500 నోటుకు చిల్లర అడిగారు. సదరు వ్యక్తులు ఇచ్చిన నకిలీ ఐదువందల నోటుకు విశాల్ చిల్లర ఇచ్చాడు. అదే అదునుగా భావించిన ఆ నలుగురు వ్యక్తులు మళ్లీ మరో నాలుగు నకిలీ రూ.500 నోట్లు ఇచ్చి చిల్లర ఇవ్వమని కోరగా వాటికి కూడా విశాల్ చిల్లర ఇచ్చాడు. చిల్లర తీసుకుని ఆ నలుగురు అక్కడి నుంచి జారుకున్నారు. అనంతరం గుత్తుల విశాల్ తన దగ్గరున్న రూ.500 నోట్లను పరిశీలించగా అవి నకిలీ నోట్లుగా కనిపించాయి. ఆ నోట్లపై చిల్డ్రన్ బ్యాంకు ఆఫ్ ఇండియా అని ముద్రించి ఉందని గుర్తించి పరవాడ పోలీసులను ఆశ్రయించారు. నకిలీ నోట్ల చలామణిపై గుత్తుల విశాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు నకిలీ నోట్లను చలామణి చేస్తున్న నలుగురు ముఠాసభ్యులను మంత్రిపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో ఆదివారం సాయంత్రం అరెస్టు చేసి ఆరు నకిలీ రూ.500 నోట్లు, 20 అసలు రూ.100 నోట్లను స్వాధీనం చేసుకున్నారు.

కాలిబూడిదైన పెంకుటిల్లు

- విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం
- కాలిపోయిన రూ.3.5 లక్షల నగదు, ఆరుతులాలు బంగారం

మక్కువ: మండలకేంద్రం మక్కువలోని మజ్జివీధిలో ఆదివారం విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో జరిగిన ప్రమాదంలో గ్రామానికి చెందిన కొవ్వాడ వెంకటరమణ పెంకుటిల్లు పూర్తిగా అగ్నికి ఆహుతైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వెంకటరమణ దంపతులు ఆదివారం ఉదయం ఇంటికి తాళం వేసి, పొలంపనుల నిమిత్తం బయటకు వెళ్లారు. వెంకటరమణ ఇంటినుంచి పెద్ద ఎత్తున పొగరావడాన్ని స్థానికులు గమనించారు. ఇంటిలోని ఫ్రిడ్జి కంప్రెషర్ పేలి ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న వెంకటరమణ దంపతులు పొలం నుంచి రోదిస్తూ, ఇంటికి చేరుకునేలోగా ఇంట్లో ఉన్న 3.5 లక్షల నగదు, ఆరు తులాల బంగారం, సర్టిఫికెట్లు, బాండ్లు, తిండిగింజలు, ఫర్నిచర్ కాలిపోయాయి. స్థానికులు మంటలార్పే ప్రయత్నం చేసినప్పటికీ, ఫలితం లేకపోయింది. అగ్నిమాపక సిబ్బంది చేరుకునేలోపు ఇల్లు మొత్తం కాలిబూడిదైంది. సంఘటనా స్థలానికి రెవెన్యూ సిబ్బంది చేరుకుని జరిగిన నష్టాన్ని అంచనా వేశారు.